క్లుప్తంగా

నేడు విద్యా సంస్థల బంద్

పీలేరు రూరల్ : దేశవ్యాప్తంగా గురువారం చేపట్టనున్న విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృతతేజ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నీట్ పరీక్ష లీకేజీ వెనుక కుంభకోషం, నీట్ పీజీ పరీక్షను 12 గంటల ముందు వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం

పీలేరు : విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామని ఏడీఈలు శ్రీనివాసులు, సుధాకర్, శివయ్య అన్నారు. బుధవారం పీలేరు డివిజన్ కార్యాలయంలో పీలేరు, పీలేరు రూరల్, కలికిరి సబ్ డివిజన్ పరిధిలోని రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. 12 మంది రైతుల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈలు, రైతులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ములకలచెరువు : స్థానికంగా ఉన్న సచివాలయం-1ను బుధవారం ఎంపీడీఓ పోలప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వంద శాతం పెన్షన్ల పంపిణీ పూర్తిపై సిబ్బంది పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరుపై ఆరాతీశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మదనపల్లె సిటీ : స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీయోగభోగేశ్వరస్వామి ఆలయం, చిత్తూరు రోడ్డులోని కనులో గంగమ్మగుడిలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. యోగభోగేశ్వర స్వామి ఆలయంలో మూడు నెలకు రూ. 1,33,153, కనుమలో గంగమ్మగుడిలో మూడు నెలలకు రూ.2,53,023 ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఈఓ రమణ తెలిపారు. హుండీ లెక్కింపులో వేదపండితులు లక్ష్మణ, మురళి, సిబ్బంది అంకన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెల్డింగ్ కార్మికుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న సహారా వెల్డర్స్ అసోసియేషన్

పీలేరు : అనారోగ్యంతో బాధపడుతున్న వెల్డింగ్ కార్మికుడికి సహారా వెల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. స్థానిక ఎస్‌కేడీ నగర్‌కు చెందిన నాగూర్‌బాషా ఓ వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు. కొంత కాలంగా ఆయన మెదడుకు చెందిన సంబంధించిన వ్యాధితో బాధపడుతు తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సహారా వెల్డర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బోడేషా, ఖాదర్‌వల్లి సంఘం సభ్యుల వద్ద రూ. 52 వేలు వసూలు చేసి నాగూర్‌బాషాకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు బాబా అలి, ఇర్ఫాన్, తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరెద్దుకు అంతిమ సంస్కారం

కురబలకోట : మండలంలోని దిగువబోయపల్లెకు చెందిన దేవరెద్దుకు బుధవారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వయో భారంతో ఇటీవల ఇది మెత్తబడింది. ఊరి బయట పడిపోయి ఉండగా మంగళవారం గ్రామస్థులు కనుగొన్నారు. 20 ఏళ్ల క్రితం దీన్ని గ్రామస్థులు దేవరెద్దుగా సంప్రదాయబద్ధంగా పట్టారు. ఉత్సవాలు, దేవర్లు, ఊరేగింపులకు అలంకరించి మెరువనగా గ్రామస్థులు తీసుకెళ్లేవారు. దేవరెద్దుల సంస్కృతి తరాలుగా వస్తోంది. నేటి తరం కూడా ఆచరిస్తోంది. దేవరెద్దు అంతిమ సంస్కారాన్ని వేడుకగా నిర్వహించారు.

కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన



నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వన్ టౌన్ ఎస్ఐ హరిహర ప్రసాద్

మదనపల్లె : న్యాయ వ్యవస్థలో కీలక మార్పులు చేస్తూ కేంద్రం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై పట్టణంలోని వివేకానంద హై స్కూల్, సీఎస్ఐ పాఠశాలలో వన్ టౌన్ ఎస్ఐ హరిహర ప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐపీసీ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అమలు అవుతాయన్నారు. పిల్లలను కొనడం అమ్మడం కొత్త చట్టాల ప్రకారం తీవ్రమైన నేరం అని తెలిపారు. మైనర్‌పై సాముహిక అత్యాచారం చేస్తే జీవిత ఖైదు లేదా మరణ శిక్ష పడు తుందని పేర్కొన్నారు. క్రైం అండ్ క్రిమినల్ కొత్త చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు . కార్యక్రమంలో హెచ్ఎం రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష..దిగుబడికి రక్ష

- జిల్లాలో ప్రారంభమైన భూసార పరీక్షలు
- 10850 మట్టి శాంపిల్స్‌సేకరణ
- భూమిలో సమతుల్యత సాధించడమే లక్ష్యం
- సద్వినియోగం చేసుకొంటే రైతుకు ఎంతో మేలు



భూసార పరీక్షల నిమిత్తం పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్న దృశ్యం

గుర్రంకొండ : భూసార పరీక్షలతో భూమిలో పోషక విలువల సమత్యులత సాధించవచ్చు. ఈ దిశగా రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 10850 మట్టినమూనాలను సేకరించే పనిలో వ్యవసాయశాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. సేకరించిన మట్టినమూనాలను కడపలోని సాయిల్‌టెస్ట్ సెంటర్‌కు పంపనున్నారు. భుసార పరీక్షల ఫలితాల ద్వారా సారం కోల్పోయిన భూమిలో పోషక విలువల సమతుల్యత సాధించవచ్చు. తద్వారా పంటల సాగులో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఆర్బీకేల్లో ప్రారంభమైన మట్టినమూనా సేకరణ వారం రోజుల్లో ముగియనుంది. కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకొంటే ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

ఏడాది, మూడేళ్ల కొకమారు భూసార పరీక్షలు

నీటి సాకర్యం ఉన్న చోట బోర్లు, బావులు, సాగునీటి కాలువల ద్వారా ఏడాది పొడవునా అక్కడి పొలాల్లో ఏడాదికొకమారు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. ప్రతి మూడు సీజన్‌లకొకమారు భూసార పరీక్షలు చేయించుకోవడం వలన రైతుకు మంచి ఫలితాలు వచ్చే అవకాశముంది. వర్షాధార పంటల సాగు భూముల్లో అనగా కేవలం ఏడాదిపొడవునా కురిసే వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేసే మెట్ట భూముల్లో మూడేళ్ల కొకమారు భుసార పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. రైతులు పంటలు సాగు చేసిన ప్రతి సారి భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. భూసార పరీక్షతో భూమిలో ఎంతమేరకు వీటి శాతం తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంటసాగు చేసే ముందు పొలంలో తగినంత మేరకు వీటిని పిచికారి చేస్తే భూసారం మళ్లీ యథాస్థితికి చేరుకొని మంచి పంట దిగుబడులు సాధించవచ్చు.

ఖరీఫ్, రబీసీజన్ ప్రారంభాలు అనుకూలం

భూసార పరీక్షల కోసం భూమిలో మట్టినమూనాలను సేకరించేందుకు ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభసమయాలు చాలా అనుకూలంగా ఉంటాయి. ఏడాదిలో ఈ రెండు సీజన్ ప్రారంభసమయాల్లో చాలా వరకు పొలాల్లో పంటలు సాగు ఉండదు. దీంతో బీడు భూములు అధికంగా ఉంటాయి. అప్పుడు మట్టినమూనాలు సేకరిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయనేది వ్యవయసాయాధికారుల నమ్మకం.

ఎనిమిది చోట్ల మట్టిసేకరణ

భూసార పరీక్షల్లో భాగంగా ఒక పొలంలో ఎనిమిది చోట్ల మట్టినమునాలను సేకరిస్తారు. అవి వర్షాధార భూములైనాసరే, నీటి సౌకర్యం ఉన్న పొలాలైన సరే ఒకే మట్టిసేకరణ విధానం ఒకేలా ఉంటుంది. పొలం నలుమూలల ఎనిమిది చోట్ల వీ ఆకారంలో తవ్వి ఒక చోట అరకిలో చొప్పున మట్టిని నమూనాలను సేకరిస్తారు. తరువాత మట్టిమొత్తాన్ని ఒకేచోట కలిపి భూసార పరీక్షలు చేస్తారు. తద్వారా పొలంలో పోషకాలు ఎంతమేరకు ఉన్నాయో తెలిసే అవకాశం ఉంటుంది.

జిల్లా వ్యాప్తంగా 10850 శాంపిల్స్ సేకరణే లక్ష్యం : భుసార పరీక్షల నిమిత్తం జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్బీకేల పరిధిలో మొత్తం 10850 మట్టి శాంపిల్స్‌ను సేకరిండమే లక్ష్యంగా ఎంచుకొన్నారు. ప్రస్తుతం జిల్లాలోని వ్యవసాయశాఖ, ఆర్బీకే సిబ్బంది రైతుల పొలాల్లో నుంచి మట్టిసేకరించేపనిలో నిమగ్నమయ్యారు. వారం రోజుల్లోగా మట్టి నమూనా సేకరణ పనులు పూర్తి చేసేలా అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

21 రోజుల్లో ఫలితం : భూసార పరీక్షల నిమిత్తం సేకరించిన మట్టి నమూనాల ఫలితాలను 21 రోజుల తరువాత ప్రకటిస్తారు. ఆర్బీకే సిబ్బంది భూసార పరీక్షల ఫలితాన్ని సదరు పొలం రైతుకు తెలియజేస్తారు. తద్వారా సదరు పొలంలో నత్రజని, పొటాష్, భాస్వరం, కాల్షియం, ఐరన్‌తో పాటు ఉదకజనిక సూచిక, సేంద్రీయకర్బనం వంటి ఎంత మేరకు ప్రస్తుతం భూమిలో ఉన్నాయో ఫలితాలు సూచిస్తాయి. దీంతో పొలంలో భుసారాన్ని పెంపొందించేందకు ఏలాంటి పోషక విలువలు కలిగిన ఎరువులు వాడాలో వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తారు.

స్థూల, సూక్ష్మపోషకాల సమతుల్యత

పంటలు సాగు చేసే పొలాల్లో, చేలల్లో స్థూల, సూక్ష్మ పోషకాల సమతుల్యత భూసార పరిక్ష ద్వారా సరి చేసుకోవాల్సి ఉంటుంది. పొలాలను దుక్కుల చేసే సయయంలోనూ, విత్తనాలు వేసే సమయంలో సూక్ష్మ పోషకాల మందులను వినియోగించాల్సి ఉంటుంది.

బోరాన్, సల్ఫర్ : పంట సాగులో బోరాన్, సల్ఫర్‌ను తప్పనిసరిగా వినియోగించాలి. తద్వారా కాయలు నాణ్యతగా వస్తాయి. వాటి బరువు కూడా పెరుగుతుంది.

జింక్ : జింక్ వినియోగించడం వలన మొక్కల్లో కాండం, మొక్క ఎదుగుదల ఎక్కువగా, ధృడంగా ఉంటాయి. అంతేకాకుండా కాయల్లో గింజ ఏర్పడే శాతం పెరుగుతుంది.

జిప్సమ్ : పొలాల్లో జిప్సమ్ చల్లడం వలన గింజల్లో నూనె శాతం ఎక్కువగా ఏర్పడుతుంది. పంటపొలాలు దుక్కులు చేసే సమయంలో ఎకరానికి 200 కేజిల జిప్సమ్ చల్లాలి.

సద్వినియోగంతోఅధిక దిగుబడులు:

రైతులు భూసార పరీక్షలను సకాలంలో సద్వినియోగం చేసుకోవడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చు. భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలు తెలుసుకోవడం వలన పంటల సాగులో లోటుపాట్లను అధిగమించి మంచి ఫలితాలు సాధించవచ్చు. సాధారణ దిగుబడి కంటే అధికంగా దిగుబడులు సాధించే అవకాశముంది.

పోషక విలువలు తెలుస్తాయి



భుసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతుకు ఎంతో మేలు జరుగుతుంది. భూమిలో పోషకవిలువలు ఎంత మేరకు ఉన్నాయో ఈపరీక్షల ద్వారా తెలుస్తుంది. తద్వారా భూములు, పొలాల్లో లోపించిన పోషక విలువలను సరిచేసుకొనే అవకాశాన్ని రైతులకు ప్రభుత్వం కల్పించడం హర్షణీయం.

– మల్లికార్జున, రైతు, గుర్రంకొండ

మట్టిశాంపిల్స్ సేకరణ



గ్రామాల్లోని ఆర్బీకే సిబ్బంది రైతుల పొలాల్లో మట్టి శాంపిల్స్ సేకరిస్తున్నారు. వారం రోజుల్లో మట్టినమూనాల సేకరణ పూర్తి అవుతుంది. వీటికి సంబంధించి 21 రోజుల తరువాత భూసార పరీక్షల ఫలితాలను రైతులకు తెలియజేస్తాం. పొలంలో ఉన్న లోపాలను తెలియజేసి లోపాలు సరిచేసుకొనే సూచనలు, సలహాలు ఇస్తాం.

– నవీన్‌కుమార్‌రెడ్డి, ఏఓ, గుర్రంకొండ

భూములు సారవంతంగా మార్చుకోవచ్చు



భూసార పరీక్షలతో పొలాలు, భూములు సారవంతంగా మార్చుకోవచ్చు. గత రెండు సంవత్సరాలుగా భూసార పరీక్షలు నిర్వహించే కార్యక్రమం జరుగుతోంది. భూసార ఫలితాల కార్డులను రైతులకు అందజేస్తాం. గుల్లబారిపోయిన భూములు సారవంతంగా మార్చుకొనే అవకాశముంది. తద్వారా అధిక పంట దిగుబడిలు సాధించవచ్చు.

– వాణీశ్రీ, ఏడీఏ, వాల్మీకిపురం

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

డ్వామా పీడీ మద్దిలేటి



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ మద్దిలేటి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

మదనపల్లె : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని డ్వామా పీడీ మద్దిలేటి అన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ 18వవిడత సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం స్త్రీ శక్తి, ఉపాధిహామీ భవనము ఆవరణలో బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మద్దిలేటి మాట్లాడుతూ...2023-24 ఆర్థికసంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులు, సామాజిక భద్రతా పింఛన్లపై మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించామన్నారు. అందులో మదనపల్లె మండలంలో 3,624 పనులకు వేతనాల రూపంలో 4కోట్ల 36 లక్షల 51వేల 555 రూపాయలు, మెటీరియల్ రూపంలో 3కోట్ల79 లక్షల18 వేల 579 రూపాయలు ఖర్చుచేశామన్నారు. దీనికి సంబంధించి సామాజిక తనిఖీ బృంద సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన పలు అంశాలపై నివేదిక రూపంలో పొందుపరిచారన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఖర్చుచేసిన మొత్తంలో దాదాపు 3 కోట్ల వరకు, పీఎం ఆవాస్‌యోజన, హౌసింగ్ పథకానికే ఖర్చుచేశామన్నారు. ఉపాధిహామీ పథకం అన్‌లిమిటెడ్ అని, ఇందులో రోజువారి కూలీలు ఎంత పనైనా చేసుకోవచ్చని, ఒకొక్కరికి గరిష్టవేతనం రూ.300 అందేలా ప్రభుత్వం పెంచిందన్నారు. అన్నమయ్యజిల్లాలో హార్టికల్చర్ క్రాప్స్ 8వేల ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, మండలంలోని రైతులు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలన్నారు. మామిడి, సపోటా, జామ, అల్లనేరేడు, డ్రాగన్‌ఫ్రూట్స్, మునగ తదితర ఉద్యానపంటలకు మంచి రాయితీలు, 3 ఏళ్ల పాటు నిర్వహణకు, ఎరువులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సామాజిక తనిఖీ బృంద సభ్యులు గ్రామాల్లో జరిపిన తనిఖీల్లో మండలంలోని 8 సామాజిక భద్రతా పింఛన్లకు అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయని, విచారించి నివేదిక ఇవ్వాల్సిందిగా డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డిష్ రమణ, ఉపాధిహామీ పథకం జిల్లా సహాయ విజిలెన్స్ అధికారి ప్రకాష్, ఎంపీడీఓ భానుప్రసాద్, ఏపీడీ మధుబాబు, డీపీఎం-పెన్షన్స్ ధర్మరాజు, ఏపీఓ జి.సుబ్రహ్మణ్యం, ఏఈపీఆర్ రమణ, ఎస్ఆర్‌పీ మూర్తి, సర్పంచ్ శరత్‌రెడ్డి, ఉపాధిహామీ, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ఐ నాగేశ్వరరావు

వాల్మీకిపురం : ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాల్మీకిపురం ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు లైసెన్సు, వాహనాల రికార్డులు, ఇన్సూరెన్స్, ట్యాక్స్ తదితర వాటిని తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. అలాగే ఎవరైనా సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు గురి చేస్తే పెద్దలకు జైలు శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : ప్రయాణీకులకు ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని డీఎం బి. కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సుండుపల్లె, సోమల మార్గాల్లోని ప్రయాణీకులకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు. పీలేరు- సుండుపల్లె మార్గంలో మొదటి బహుమతి కె. మునిరాజ, ద్వితీయ బహుమతి భూదేవి, తృతీయ బహుమతి గౌతమ్‌లకు లభించాయి. సోమల – కలకడ మార్గంలో మొదటి బహుమతి ఎస్. రెడ్డెమమ ద్వితీయ బహుమతి పి. షికా, తృతీయ బహుమతి ఆర్. సాంబశివలకు మౌర్య కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దేవులపల్లె మౌర్యరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, ఎస్టీఐ బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న క్లస్టర్ ఏపీడీ మధుబాబు

పెద్దతిప్పసముద్రం : ఉపాధి హామీ ద్వారా అమలవుతున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ క్లస్టర్ ఏపీడీ మధుబాబు సూచించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ రైతుల పొలాల్లో ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయ అనుసంధాన పనులను వినియోగించుకోవచ్చాన్నారు. పండ్ల తోటలు, పూల తోటలు, మునగ తోటలు, మల్బరీ తోటల పెంపకం, పొలంగట్ల వెంబడి గడ్డి పెంపకం, గడ్డి పెంపకం పనులు కూడా చేసుకోవచ్చన్నారు. అంతేగాక వర్షపు నీటి నిల్వ పనులు, రైతు పొలాలకు ఒండ్రుమట్టి సారవంతపు పనులు, ఫారంపాండ్ నిర్మాణ పనులు, మట్టి గెనాలు, రాతి గెనాలు, కూలీలతో భూమి ఎత్తు పల్లాలను చదును చేయడం, పూడిక తీత పనులతో పాటు పశువులు, మేకల షెడ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ ద్వారా అమలవుతున్నాయన్నారు. ఇంకా ప్రభుత్వ, కమ్యూనిటీ భూముల్లో చేపడుతున్న పనులపై ఉపాధి హామీ సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించామన్నారు. ములకలచెరువు క్లస్టర్ పరిధిలో పని చేసే క్షేత్ర,సాంకేతిక సిబ్బంది గ్రామాల్లోని రైతులకు, కూలీలకు కూడా ఈ పథకాలపై అవగాహన కల్పించి కూలీల పని దినాల సంఖ్యను పెంచేలా ప్రణాళిక రూపొందించామని ఏపీడీ తెలిపారు.

నేడు యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం

మదనపల్లె సిటీ : మాసశివరాత్రి పురస్కరించుకుని గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే పూజల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

త్వరలో కొత్త బస్సులు



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : మదనపల్లె-1, 2 డిపోలకు త్వరలో కొత్త బస్సులు రానున్నట్లు ఆర్టీసీ డీఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం టు డిపో గ్యారేజ్‌లో గేట్ మీటింగ్ నిర్వహించారు. జూన్‌లో రీజనల్ స్థాయిలో వన్ డిపో ఓఆర్‌లో మొదటి స్థానం, టు డిపో రెండవ స్థానం నిలిచిందన్నారు. జూలైలో 70 శాతం కంటే ఎక్కువ ఓఆర్ సాధించి రెండు డిపోలను రీజియన్‌లో మొదటి స్థానంలో నిలపాలన్నారు. డిప్యూటీ సీఎంఈ డిపోకు కావాల్సిన మెటీరియర్స్, ఇంజన్స్, యూనిట్స్, స్పేర్స్ అన్ని త్వరలో పంపుతామని తెలిపినట్లు తెలిపారు. ప్రయాణికులకు అన్ని రూట్స్ నందు, రిక్వెస్ట్ స్టాప్‌లలో తప్పనిసరిగా ఎక్కించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ గీత,సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎర్రగుంట్లమ్మ జాతర



దీలు, బోనాలు తీసుకెళుతున్న మహిళలు

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె ప్రజలు ఎర్రగుంట్లమ్మ .. కరుణించమ్మా అంటూ బుధవారం భక్తిశ్రద్ధలతో జాతర నిర్వహించారు. తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండ అటవీ ప్రాంతం పొలమేర్లలో వెలసిన ఎర్రగుంట్ల ఆలయంలో జాతర నిర్వహించారు. మహిళలు దీలు, బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. చాందినీ బండ్ల మెరవణి ఆకట్టుకున్నాయి.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



డెంగీ నివారణపై అవగాహణ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కలకడ : డెంగీ నివారణపై వైద్య సిబ్బంది బుధవారం అవగాహ ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణలో అందరి భాగస్వామ్యం అవసరమని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పారిరెడ్డిగారిపల్లెలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. తీవ్రజ్వరం, తలనొప్పి, కీళ్ళనొప్పులు, వికారం, చర్మంపై దద్దుర్లు, అలసట ఉన్నట్లు అయితే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలన్నారు. డెంగీ నివారణకు దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జవహర్‌బాబు, ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడి

హార్టికల్చర్ అధికారి ఈశ్వర ప్రసాద్ రెడ్డి

నిమ్మనపల్లె : సరైన సస్యరక్షణ చర్యలతో మామిడి పంటలు అధిక దిగుబడి సాధించవచ్చని మదనపల్లె హార్టికల్చర్ అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... మండలంలో 13 ఎకరాల్లో మామిడి పంట సాగు అవుతుందన్నారు. మామిడి పంట కోత అనంతరం తప్పనిసరిగా కొమ్మ కత్తిరింపులు చేయాలన్నారు. చెట్టు చుట్టూ పాదులు ఏర్పాటు చేసి 1.5 కిలోల యూరియా మూడు కిలోల సూపర్ ఫాస్ఫేట్ ఒక కిలో పొటాష్ కలిపి పాదులలో వేసి నీరు పెట్టుకోవాలన్నారు. ఇలా చేయడం వలన ఒకే సమయానికి పూత వస్తుందన్నారు. ఉద్యానవన పంటల సాగులో ఉపయోగిస్తున్న బిందు సేద్య పరికరాలకై, 2024-2025 సంవత్సరానికి గాని నివేదికలు పంపడం జరిగిందన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే రాయితీపై రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు.

ప్రతి మంగళవారం నిమ్మనపల్లెలో ..

ఇకపై ప్రతి మంగళవారం నిమ్మనపల్లె మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు తగు సలహాలు సూచనల కోసం సంప్రదించాలని కోరారు.

పిల్లల చదువు ఇంటికి వెలుగు

మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి



బోర్డుపై సంతకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి

మదనపల్లె సిటీ : పిల్లల చదువు ఇంటికి వెలుగు అని మున్సిపల్ చైర్మన్ వి.మనూజారెడ్డి అన్నారు. బుధవారం బాలికల ఉన్నేత పాఠశాలలో క్రై,ఫోర్డు సంయుక్త ఆధ్వర్యంలో పూరి పదాయ దేశానికి భళాయ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలికలు చదవాలి, ఎదగాలి, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి బిడ్డను చదవించడం తల్లిదండ్రుల బాధ్యతన్నారు. సమాజంలో అమ్మాయిలకు చదువుకునే స్థానం తల్లిదండ్రులు కల్పించాలని కోరారు. అమ్మాయిలను, అబ్బాయిలను వేర్వేరుగా చూడరాదన్నారు. అనంతరం ప్రచార కార్యక్రమం బోర్డులో సంతకాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, రఫీ, ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ, సంస్థ సిబ్బంది రాధారాణి, అల్తాఫ్, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మిద్దాం



బీసీజీ టీకాల ప్రాముఖ్యత పై అవగాహన ర్యాలీ

మదనపల్లె : క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మిద్దామని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబి పర్యవేక్షకులు ప్రభాకర్ అన్నారు. బుధవారం వారు మునిసిపాలిటీ పరిధిలోని ఎన్. వి.ఆర్. లేఔట్ ,వడ్డి పల్లి,బెంగళూరు బస్టాండ్, జామియా మసీదు, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ లో బి.సి.జి.టీకా ప్రాముఖ్యత పై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సోమ, గురువారాల్లో పెద్దలకు టి.బి.జబ్బు రాకుండా బి.సి.జి.టీకాలు ఆరోగ్య కేంద్రాల్లో వేయడం జరుగుతుందన్నారు.60సం పై బడిన వారు,షుగర్ వ్యాధి గ్రస్థులు,బీడీ,సిగరెట్ త్రాగువారు,టి.బీ. జబ్బు వచ్చి తగ్గి కోలుకున్న రోగులు ,టి.బి.రోగి కాంటాక్ట్స్,ఎత్తుకు తగ్గ బరువు 18 కంటే తక్కువ ఉన్న వారు బి.సి.జి.టీకా తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 2025 నాటికి, టి.బి. ముక్త్ భారత్ లక్ష్య సాధనకు అందరూ సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో హెచ్.వి లు వనజ,సుశీల,తరుణ్, సునీత, ఏ. ఎన్. ఎమ్ లు పద్మ ప్రియ,అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్–100 యూనియన్ రికార్డులు అప్పగించాలి



మాట్లాడుతున్న స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

మదనపల్లె : మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్, రిజిస్టర్డ్ నెం. ఎఫ్ 100కు సంబంధించిన రికార్డులను పాత కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తక్షణమే అప్పగించాలని నూతన కార్యవర్గ అధ్యక్షులు యన్.నందగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...గతంలో ఉన్న యూనియన్ కమిటీ అధ్యక్షులు కమిటీని, కార్మికులను సంప్రదించకుండా, పదేళ్లుగా జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించకుండా ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. లిక్విడేటర్ ఇచ్చిన ప్రతి కార్మికుడి బకాయిల విషయం ఏమాత్రం పట్టించుకోకుండా, స్వార్థంగా కర్ణాటక హైకోర్టులో కేసు వేసి కార్మికులకు రావాల్సిన బకాయిలను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారన్నారు. దీంతో కార్మికులకు పాత కార్యవర్గంపై విరక్తి పుట్టి, దాన్ని రద్దుపరుస్తూ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. తిరుపతిలోని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌ను కలిసి జరిగిన విషయాలన్నింటినీ నివేదించామన్నారు. మూడునెలల క్రితం మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ లిక్విడేటర్, ఎఆర్‌సీ ద్వారా ఆన్‌లైన్ టెండర్ నిర్వహిస్తే, అందులో రూ.39కోట్లకు తిరుపతికి చెందిన శ్రీహరి కన్‌స్ట్రక్షన్స్ కొనుగోలు చేసిందన్నారు. వారు కార్మికులకు రూ.2.19కోట్లు చెక్కుల రూపంలో ఉచితంగా ఇచ్చారన్నారు. ఈ సొమ్ములో తమకు ప్రతి కార్మికుడు రూ.5వేలు ఇవ్వాలని పాత కమిటీ అధ్యక్షులు, కార్యవర్గసభ్యులు డిమాండ్ చేస్తే ఎవ్వరూ ఇవ్వలేదన్నారు. నూతన కార్యవర్గ అనుమతులకు సంబంధించి త్వరలో తిరుపతిలోని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌ను కలుస్తామని, సర్వసభ్య సమావేశ వివరాలను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి, హోంమినిస్టర్ కార్యాలయానికి పంపుతామని తెలిపారు. సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ యం.కృష్ణారెడ్డి, కోశాధికారి రవిచంద్ర, జాయింట్ సెక్రెటరీ ఎం .భాస్కర్‌రెడ్డి, ఇ.శివమల్లప్పనాయుడు, ఎస్.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.